కరెంట్ కష్టాలకు ఇక చెల్లు

- సోమేశ్వరంలో రూ.2.68 కోట్లతో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం
- నేడు ప్రారంభించనున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు



సోమేశ్వరంలో రూ.2.68 కోట్లతో ప్రారంభానికి సిద్ధమైన 33/11 కేవీఏ సబ్‌స్టేషన్

రాయవరం: దశాబ్దాల తరబడి గ్రామస్తులు ఎదుర్కొంటున్న విద్యుత్తు వెతలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చెల్లుచీటీ ఇచ్చింది. విద్యుత్ వినియోగ దారులకు మెరుగైన, నాణ్యమైన, నిరంతర విద్యుత్తును సరఫరా చేసేందుకు మండలంలోని సోమేశ్వరం గ్రామంలో 32/11 కేవీఏ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మించారు. ఈ సబ్ స్టేషన్‌ను బుధవారం ఎమ్మెల్సీ త్రిమూర్తులు చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. సోమేశ్వరంతో పాటు, మాచవరానికి కూడా ఇకపై నాణ్యమైన విద్యుత్తు సరఫరా జరగనుంది.

గాలొస్తే కరెంట్ కట్

సోమేశ్వరం, మాచవరం గ్రామలకు రాయవరం సబ్ స్టేషన్ నుంచి విద్యుత్తు సరఫరా జరిగేది. పొలాల మీదుగా ఏర్పాటు చేసిన లైన్ ద్వారా విద్యుత్తు సరఫరా అయ్యేది. వర్షాలు, తుపాన్లు, ఈదురు గాలుల సమయంలో లైన్లలో ఏర్పడే సాంకేతిక లోపాలతో విద్యుత్తు సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడేది. లోవోల్టేజి సమస్య కూడా తీవ్రంగా ఉండేది. విద్యుత్తు సరఫరాలో హెచ్చు తగ్గుల కారణంగా వినియోగదారులు సతమతం అయ్యేవారు. టీడీపీ హయాంలో సబ్ స్టేషన్‌కు అట్టహాసంగా భూమిపూజ చేసినా, నిధులు మంజూరు కాక సబ్ స్టేషన్ పనులు చేపట్టలేదు.

రూ.2.68 కోట్లతో నిర్మాణం

ఎన్నో ఏళ్లుగా గ్రామస్తులు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరాకు ఎదురు చూస్తున్న తరుణంలో సర్పంచ్ ఆరిఫ్ సమస్యను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దృష్టికి తీసుకుని వెళ్లారు. త్రిమూర్తులు వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లడంతో 33/11 కేవీఏ సబ్ స్టేషన్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.68 కోట్లు మంజూరు చేసింది. దీంతో మార్కెట్‌ను ఆనుకుని ఉన్న పంచాయతీకి చెందిన 40 సెంట్ల స్థలాన్ని పంచాయతీ తీర్మానం చేసి, విద్యుత్తు శాఖకు అప్పగించారు. సబ్ స్టేషన్ నిర్మాణ పనులను గతేడాది ఫిబ్రవరి 7న ఎమ్మెల్సీ త్రిమూర్తులు



నిమ్మకాయల దోసారావు(ఫైల్)



జక్కంపూడి రామ్మోహన్‌రావు(ఫైల్)

భూమి పూజ చేసి ప్రారంభించారు. శరవేగంగా సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు పూర్తి చేసుకుని బుధవారం ఎమ్మెల్సీ త్రిమూర్తులు చేతుల మీదుగా ప్రారంభానికి నోచుకుంటోంది.

రూ.3.57 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం

సోమేశ్వరంలో చేపట్టిన రూ.3.57 కోట్ల అభివృద్ధి పనులను ఎమ్మెల్సీ త్రిమూర్తులు బుధవారం ప్రారంభించనున్నారు. ఈ విషయాన్ని సర్పంచ్ ఆరిఫ్ మంగళవారం విలేకరులకు తెలిపారు. రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం , రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.10 లక్షలతో నిర్మించిన శెట్టిబలిజ సామాజిక భవనం, రూ.17.50 లక్షలతో గడప గడపకూ మన ప్రభుత్వం పనులతో పాటుగా రూ.2.68కోట్లతో నిర్మించిన 33/11కేవీఏ సబ్ స్టేషన్‌ను ఆయన ప్రారంభించనున్నారు.

విగ్రహావిష్కరణలు కూడా

పంచాయతీ సర్పంచ్‌గా పనిచేసి, గ్రామాభివృద్ధిలో తనదైన ముద్ర వేసిన నిమ్మకాయల దోసారావు విగ్రహాన్ని గ్రామంలో బుధవారం ఆవిష్కరించనున్నారు. 2006 నుంచి 2011 వరకు సర్పంచ్‌గా పనిచేసిన దోసారావు గ్రామంలో అజాత శత్రువుగా పేరుతెచ్చుకున్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం నిబద్ధత కలిగిన నాయకుడుగా దోసారావు పేరు తెచ్చుకున్నారు. అలాగే సోమేశ్వరంతో పాటుగా, దోసారావుతో ప్రత్యేక అనుబంధం ఉన్న మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహన్‌రావు విగ్రహాన్ని కూడా ఆవిష్కరించనున్నారు. ఎమ్మెల్సీ త్రిమూర్తులు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రామ్మోహన్‌రావుల చేతుల మీదుగా విగ్రహావిష్కరణలు చేపట్టనున్నారు.

క్లుప్తంగా

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



ప్రమాదాలకు నిలయంగా ఉన్న మలుపు

కె.గంగవరం: మండలంలోని తామరపల్లి ప్రారంభంలోని మలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. రెండుసార్లు ప్రమాదకరంగా మలుపులు ఉండడం పక్కనే చెరువు ఉండడం వల్ల ప్రయాణికులు గాయాల పాలవుతున్నారని స్థానికులు అంటున్నారు. ప్రస్తుతం ఇసుక లారీలు మలుపుల వద్ద కూడా స్పీడు తగ్గించకుండా వస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. రహదారి నిర్మించినప్పటి నుంచి అధికారులకు స్పీడు బ్రేకర్లు వేయాలని వేడుకుంటున్నామని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్పీడుబ్రేకర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఫైలేరియా వ్యాధితో అప్రమత్తంగా ఉండాలి

ఎన్‌వీబీడీసీ ప్రోగ్రాం అడిషనల్ డైరెక్టర్ ఏడీఎస్ కుమార్



నల్లూరులో వైద్య ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న కుమార్

కపిలేశ్వరపురం: ఫైలేరియా వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎన్‌వీబీడీసీ ప్రోగ్రాం అడిషనల్ డైరెక్టర్ ఏడీఎస్ కుమార్ అన్నారు. అచ్యుతాపురం పీహెచ్‌సీ పరిధిలోని నల్లూరులో ఈ వ్యాధి పట్ల వైద్య ఆరోగ్య సిబ్బంది పనితీరును మంగళవారం ఆయన పరిశీలించారు. గ్రామంలో వ్యాధి పీడితులతో మాట్లాడి వ్యాధి తీవ్రతను తెలుసుకున్నారు. వైద్య ఆరోగ్య కార్యకర్తలకు వ్యాధిపై అవగాహన కార్యక్రమాల నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఆయన వెంట పీహెచ్‌సీ ఎంపీహెచ్ఎస్ శ్రీధర్, గోపాలకృష్ణ, వైద్య ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

కేశవరం పీహెచ్‌సీని సందర్శించిన డీఎంఅండ్‌హెచ్ఓ



కేశవరం పీహెచ్‌సీ సేవలపై చర్చిస్తున్న డీఎంఅండ్‌హెచ్ఓ దుర్గారావుదొర

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం కేశవరం పీహెచ్‌సీని మంగళవారం డీఎంఅండ్‌హెచ్ఓ దుర్గారావుదొర సందర్శించారు. ఈ పీహెచ్‌సీ ద్వారా పేద, మధ్య తరగతి ప్రజలకు అందిస్తున్న సేవలను ఆరా తీశారు. ఓపీ, మందుల నిల్వ రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పీహెచ్‌సీ నిర్వహణ తీరును వైద్యాధికారి సీహెచ్‌పీ లత, డాక్టర్ రమ్యశ్రీ వివరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సీహెచ్ఓ యూవీవీ గిరి, ఎంపీహెచ్ఎస్ ఎం.ప్రసాద్, వైద్య, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

టిడ్కో ఇళ్లను పేదలకు అందించాలి

కపిలేశ్వరపురం (మండపేట): మండపేటలో నిర్మితమైన టిడ్కో ఇళ్ళను త్వరితగతిన పేదలకు అందజేయాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కోటిపల్లి వీవీ సాయిరామ్, జిల్లా ఉపాధ్యక్షులు కోన సత్యనారాయణ అధికారులను డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ మేనేజర్ కనకరాజుకు మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. వారిద్దరూ మాట్లాడుతూ 2015లో నిర్మించిన ఇళ్ళను నేటికీ పూర్తి స్థాయిలో పేదలకు స్వాధీనపరచకపోవడం సరి కాదన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి గొడవర్తి రామచంద్రరావు, పట్టణ అధ్యక్షుడు మద్దుల సుబ్బారావు, నాయకులు సూర్యనారాయణ, గణపతి పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్‌కు సత్కారం

కపిలేశ్వరపురం (మండపేట): బదిలీపై ధర్మవరం వెళుతున్న మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్‌ను యూటీఎఫ్ మండపేట పట్టణ శాఖ ఉపాధ్యాయులు మంగళవారం సత్కరించారు. ఐదేళ్ల సర్వీసులో రామ్‌కుమార్ పట్టణంలోని పాఠశాలల అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ కొవ్వూరి గోపాలకృష్ణారెడ్డి అన్నారు. ఇక్కడ ఉండగా గ్రేడు-2 కమిషనర్‌గా పదోన్నతి పొందిన రామ్‌కుమార్ మరిన్ని పదోన్నతులు పొందాలని కాంక్షిస్తున్నట్లు ఉపాధ్యాయులు అన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ పట్టణ శాఖ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యురాలు ఎ.లత, ఒ.సత్తిబాబు, ఒ.సూర్య ప్రకాశరావు, బి.నారాయణరావు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పీవీవీఎల్ఎస్ మూర్తి, ఎ.శ్రీరామకృష్ణ, సత్యనారాయణరాజు, వి సూర్యలత, ఒ.గణపతి, ఎ.దేవి పాల్గొన్నారు.

గ్రామాల్లో బోస్ పర్యటన

కె.గంగవరం: మండలంలోని దంగేరు, కుడుపూరు, భట్లపాలిక గ్రామాలతో పాటు పలు శివారు గ్రామాల్లో మంగళవారం రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ పర్యటించారు. ఆయా గ్రామాల్లోని పలు సంఘాలకు చెందిన గ్రామ పెద్దలను మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మద్దతు తెలపాలని, రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పిల్లి సూర్యప్రకాష్ పోటీ చేస్తున్నారని ఆయనకు కూడా తమ మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 3న ఏలూరులో జరిగే సిద్ధం సభకు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఎన్నికల మేనిఫెస్టో పక్కాగా అమలు చేసింది దేశంలోనే వైఎస్సార్ సీపీ మాత్రమేనని గుర్తు చేశారు. పలు గ్రామాల్లో పెద్దలు రాజ్యసభ సభ్యులు బోస్‌ను శాలువాలు, పూలదండలతో ఘనంగా సత్కరించారు. పార్టీ రాజానగరం పరిశీలకుడు వట్టికూటి సూర్యచంద్రరాజశేఖర్, పార్టీ మండల అధ్యక్షుడు పెట్టా శ్రీనివాస్, యువజన నాయకులు జుత్తుక శ్యాంప్రసాద్, నాయకులు ఓబులనేని రాజ్‌కుమార్, సర్పంచ్ కొప్పిశెట్టి రమణ, ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్, బీసీ నాయకులు పంపన సుబ్బారావు, కుందూరు సర్పంచ్ పంపన సత్యానందం తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



దంగేరులో రాజ్యసభ సభ్యుడు బోస్‌ను సన్మానించిన గ్రామ పెద్దలు

సంపూర్ణ ఆరోగ్య ఆంధ్రప్రదేశే సీఎం లక్ష్యం

కాజులూరు: పేద, మధ్య తరగతి ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందించటంతో పాటు వారి ఆరోగ్య పరిరక్షణకు పథకాన్ని రూపొందించి రాష్ట్రాన్ని సంపూర్ణ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలన్నదే సీఎం జగనన్న లక్ష్యమని ఎంపీపీ మాత భారతి అన్నారు. శీలలో అధికారులు మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. దుగ్గుదుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారి వై.సుప్రియ ఆధ్వర్యంలో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన పలువురు నిపుణులైన వైద్యులు పాల్గొని సుమారు 374 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఆమె మాట్లాడుతూ గ్రామల్లో ప్రజలు చిన్న, చిన్న అనారోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేస్తూ క్రమేపీ దీర్ఘకాలిక సమస్యల బారిన పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా నిపుణులైన వైద్యులతో పొరులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి తగు చికిత్స అందించటంతో పాటు ప్రజలకు ఆరోగ్య నియమాలపై అవగాహణ కల్పించారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కోమలి వెంకటరమణ, పార్టీ మండల ఎస్సీ సెల్ నాయకుడు మాత మురళి, సచివాలయాల సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



శీల సురక్ష శిబిరంలో రోగులకు మందుల కిట్ అందజేస్తున్న నాయకులు, వైద్యులు

వైభవంగా త్యాగరాజస్వామి ఊరేగింపు

రాయవరం: ప్రముఖ వాగ్గేయకారుడు త్యాగరాజ స్వామి వారి ఊరేగింపు మండలంలోని పసలపూడి గ్రామంలో మంగళవారం వైభవంగా సాగింది. గ్రామానికి చెందిన డోలు, సన్నాయిమేళం కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఈ వేడుక నిర్వహించారు. పుష్యమాసం బహుళ పంచమిని పురస్కరించుకుని సద్గురు త్యాగరాజస్వామి వారి ఆరాధన మహోత్సవం చేపట్టారు. గ్రామానికి చెందిన ముమ్మిడివరపు సూర్యనారాయణ, కేశనకుర్తి సాంబశివ కోటయ్య, ముమ్మిడివరపు సత్తిరాజు, సత్యనారాయణ, కోటయ్య, కేశనకుర్తి స్వామి నేతృత్వంలో ఈ ఆరాధన మహోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామివారి చిత్ర పటాన్ని గ్రామంలో మేళతాళాలతో ఊరేగించారు. అనంతరం త్యాగరాజ స్వామి సంకీర్తన సేవను ప్రారంభించారు. గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సంకీర్తన సేవలో విశాఖపట్నం, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలువురు కళాకారులు త్యాగరాజ కచేరిలో పాల్గొని తమ కళాప్రతిభను ప్రదర్శించారు. తొలుతగా త్యాగరాజస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొవ్వూరి త్రినాథరెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ చింతా కృష్ణారెడ్డి, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు చింతా సుబ్బారెడ్డి, నాయకుడు చైతన్య రాజబాబు తదితరులు పాల్గొన్నారు.



త్యాగరాజస్వామి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న డోలు, సన్నాయి వాయిద్య కళాకారులు

అవగాహనే ఆయుధంగా కుష్ఠు నివారణ

- డీఎంఅండ్‌హెచ్ఓ దుర్గారావుదొర
- కాలేరులో అవగాహన కార్యక్రమం

కపిలేశ్వరపురం: అవగాహనే ఆయుధంగా కుష్ఠు వ్యాధి నివారణకు ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని డీఎంఅండ్‌హెచ్ఓ దుర్గారావుదొర అన్నారు. అచ్యుతాపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండలంలోని కాలేరులో మంగళవారం నిర్వహించిన కుష్ఠు వ్యాధి అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'వివక్షను ముగిద్దాం.. గౌరవాన్ని స్వాగతిద్దాం..' నినాదంతో మంగళవారం నుంచి ఫిబ్రవరి 13 వరకూ 'నేషనల్ లెప్రసీ అరాడికేషన్ ప్రోగ్రాం'ను నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. స్పర్శ కుష్ఠు వ్యాధి అవగాహన సమావేశాలు నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు వివరించారు. అడిషనల్ డీఎంఅండ్‌హెచ్ఓ భరతలక్ష్మి మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో కుష్ఠు వ్యాధి లక్షణాలను తొలి దశలోనే గుర్తించడం ద్వారా వ్యాధిని నిర్మూలించేందుకు అవకాశాలున్నాయన్నారు. స్థానిక వైద్యాధికారి కరుణేంద్రకుమారి మాట్లాడుతూ పీహెచ్‌సీ స్థాయిలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. వ్యాధి గ్రస్తులకు డీపీఎంఓ పోతుల వెంకటేశ్వరరావు దుప్పట్లు, బిస్కెట్లు అందజేశారు. కార్యక్రమంలో కాలేరు సర్పంచ్ దాయం కావేరి, ఉప సర్పంచ్ పలివెల పద్మమణి, డీపీఎంఓ మాధవరపు వెంకటేశ్వర్లు, కె.వరలక్ష్మి, పోతుల వెంకటేశ్వరరావు, ఎంపీహెచ్ఈఓ గోపాలకృష్ణ, ఎంపీహెచ్ఎస్ శ్రీధర్, వైద్య ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



కాలేరులో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్ఓ దుర్గారావుదొర

ఎంపీడీవో నరేంద్రరెడ్డి సేవలు ప్రశంసనీయం

రాయవరం: ఎంపీడీవోగా కొవ్వూరి నరేంద్రరెడ్డి మండలానికి అందించిన సేవలు ప్రశంసనీయమని జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ కొనియాడారు. ఉత్తమ సేవా పురస్కారం పొందిన ఎంపీడీవో నరేంద్రరెడ్డిని మంగళవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో సత్కరించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మంగతాయారు, ఎంపీపీ వెంకటరమణలు మాట్లాడుతూ ఎంపీడీవో నరేంద్రరెడ్డి ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడం, అలాగే ప్రభుత్వ పథకాలను అమలు చేయడంలో మండలాన్ని ముందంజలో ఉంచడం ఆయన సమర్థతకు నిదర్శనమన్నరు. అనంతరం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది ఎంపీడీవో నరేంద్రరెడ్డిని దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి ఎం.శ్రీనివాస్, మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ డి.శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ మల్లేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ వరప్రసాద్, పీఆర్ ఏఈఈ రామనారాయణ, హౌసింగ్ ఏఈ కె.శ్రీనివాస రెడ్డి, ఎంఈవో పి.రామలక్ష్మణమూర్తి, పంచాయతీ కార్యదర్శులు పి.వెంకటరత్నం, ఎం.నారాయణరెడ్డి, అత్తిలి గోవిందరాజులు, ధనలక్ష్మి, భాస్కరరావు, కరుణాకర్ పాల్గొన్నారు.



ఎంపీడీవో నరేంద్రరెడ్డిని సత్కరిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ తదితరులు

గాంధీ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి



దుగ్గుదుర్రులో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

కాజులూరు: పల్లెలే దేశానికి పట్టుగొమ్మలని గ్రామాల అభివృద్ధితోనే దేశం పురోగతి సాధిస్తుందన్న జాతిపిత మహాత్మాగాంధీ ఆశయాలను నాయకులు ఆదర్శంగా తీసుకుని గ్రామాభివృద్ధికి ప్రాధాన్యమివ్వాలని మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వరదా శేషారావు అన్నారు. మంగళవారం కోలంకలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో, మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రభుత్వేతర పాఠశాలలో విద్యార్థులూ గాంధీ వర్ధంతి నిర్వహించి ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారతదేశ స్వాతంత్ర్య సముపార్జనలో గాంధీజీ పాత్రను వక్తలు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమాల్లో స్థానిక నాయకులు కడలి రాంపండు, మండల ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.



రాయవరంలో మహాత్ముడి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ వెంకటరమణ


జాతిపిత అడుగుజాడల్లో పయనించాలి

రాయవరం: మహాత్ముడు చూపిన అహింసా మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని, అదే గాంధీజీకి మనమిచ్చే ఘన నివాళులని రాయవరం ఎంపీపీ నౌడు వెంకటరమణ అరు. రాయవరం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో జాతిపిత వర్ధంతిని నిర్వహించారు. అక్కడి మహాత్ముడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు తమలంపూడి గంగాధరరెడ్డి, ఎంఈవో పి.రామ లక్ష్మణమూర్తి, పంచాయతీ కార్యదర్శి పల్లేటి వెంకటరత్నం పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: మహాత్ముని అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని ఆయన వర్ధంతి కార్యక్రమాల్లో పాల్గొన్న వక్తలన్నారు. మండలంలోని ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో అధికారులు మహాత్మునికి నివాళి అర్పించారు. అంగర పీహెచ్‌సీలో డాక్టర్ పి.రత్నకుమారి, అచ్యుతాపురం పీహెచ్‌సీలో డాక్టర్ కరుణేంద్రకుమారి ఆధ్వర్యంలో ఆసుపత్రుల వద్ద గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళి అర్పించారు. 19 గ్రామాల్లోని సచివాలయాల్లో ఉద్యోగులు మహనీయుని ఆశయ సాధకు కృషి చేస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు.

పోలింగ్ బూత్‌లో వసతులు కల్పించాలి

కపిలేశ్వరపురం(మండపేట): సాధారణ ఎన్నికలకు ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌ల్లో అన్ని సౌకర్యాల ఏర్పాటును వేగవంతం చేయాలని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ ఎ.మధుసూధనరావు సూచించారు. మండలంలోని అర్తమూరు మండల పరిషత్ నంబర్-2 పాఠశాలను ఆయన మంగళవారం సందర్శించారు. పాఠశాలలో పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేసినందున విద్యుద్దీకరణ, టాయిలెట్ నిర్మాణ పనులను అత్యవసరంగా చేపట్టాల్సి ఉందన్నారు. పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎంఈవో-2 సీహెచ్‌వీ సోమిరెడ్డి, పాఠశాల హెచ్ఎం కుసుమకు సూచించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఏఎంఓ పి.రాంబాబు, సైట్ ఇంజనీర్ సూర్యనారాయణ, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ మధు, వైఎస్సార్ సీపీ నేత గొలుగూరి భాస్కరరెడ్డి పాల్గొన్నారు.



పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న సమగ్ర శిక్షా ఏపీసీ మధుసూధనరావు

ఎంపీడీఓ కీర్తిస్పందనకు ఆత్మీయ వీడ్కోలు

రామచంద్రపురం రూరల్: ఎన్నికల బదిలీల్లో భాగంగా అనకాపల్లి జిల్లా కశింకోట మండల ఎంపీడీఓగా బదిలీ అయిన రామచంద్రపురం ఎంపీడీఓ ఎస్.కీర్తి స్పందనకు ఎంపీపీ అంబటి భవాని ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది మంగళవారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఆమెను దుశ్శాలువాలు, పూలదండలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. పలువురు ఎంపీడీఓగా ఆమెతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. విధి నిర్వహణలో తనకు అన్ని విధాలుగా సహకరించిన ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర శాఖల అధికారులు, సిబ్బందికి ఎంపీడీఓ కీర్తి స్పందన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఈడబ్ల్యూడీసీ డైరెక్టర్, వెలంపాలెం సర్పంచ్ టేకుమూడి సుజాత, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ అహ్మద్ అలీ షా(బాబ్జీ), సర్పంచ్‌లు అంబటి తుకారం, కొత్తపల్లి అరుణ, నాగిరెడ్డి సతీష్‌రావు, అనిశెట్టి రామకృష్ణ, యల్లమిల్లి సతీష్‌కుమారి, నక్కిన దొరబాబు, కాట్రా గోవిందు పాల్గొన్నారు.



ఎంపీడీఓ కీర్తిస్పందనను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది

ప్రతిభను వెలికి తీసేందుకే ఆడుదాం ఆంధ్ర



వాలీబాల్ క్రీడాకారులకు షీల్డ్ అందిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ పిల్లి సూర్యప్రకాశ్

రామచంద్రపురం: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. ఆడుదాం ఆంధ్ర క్రీడా కార్యక్రమంలో భాగంగా వాలీబాల్‌లో నియోజకవర్గ స్థాయిలో హసన్‌బాద వాలీబాల్ క్రీడాకారులు ద్వితీయ స్థాయిలో నిలిచారు. రామచంద్రపురం ఆర్డీవో కార్యాలయం వద్ద ఆర్డీవో సుధాసాగర్ ఆధ్వర్యంలో జరిగిన బహుమతి ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సూర్యప్రకాష్ పాల్గొని క్రీడాకారులను అభినందించి షీల్డ్, నగదు బహుమతులను అందించారు. హసన్‌బాద సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.

కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డికి సత్కారం



కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డిని సత్కరిస్తున్న వీఆర్వోల సంఘం

రామచంద్రపురం: గుడివాడ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వెళ్తున్న రామచంద్రపురం మున్సిపల్ కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డికి వీడ్కోలు పలుకుతూ పట్టణంలోని 12 సచివాలయాలకు చెందిన పట్టణ వీఆర్వోలు మంగళవారం ఘనంగా సత్కరించారు. కమిషనర్ చాంబర్‌లో సచివాలయంలో 10 శాఖలకు చెందిన ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారని అందులో ముఖ్యంగా రెవెన్యూ శాఖ చెందిన వీఆర్వోల వారి విధులపై వివక్షకు తావు లేకుండా శ్రీకాంత్‌రెడ్డి ఎంతో సహకరించారని వీఆర్ఓల రాష్ట్ర ప్రచార కార్యదర్శి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల గౌరవ అధ్యక్షుడు ఎం.బాపూజీ కొనియాడారు. కార్యక్రమంలో రామచంద్రపురం డివిజన్ వీఆర్వోల సంఘం ఉపాధ్యక్షురాలు పి.సాయిప్రతిమ, పట్టణ అధ్యక్షుడు ఎస్.శేఖర్, కార్యదర్శి సత్యవతి, గౌరవ అధ్యక్షుడు చీకట్ల వీరాంజనేయులు, ఉపాధ్యక్షులు ఎస్.సత్యనారాయణరెడ్డి, సహాయ కార్యదర్శి చిక్కాల మానస, కోశాధికారి సీతా మహాలక్ష్మితో పాటు కనకదుర్గ, నర్మదా, శిరీషా, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో భవన నిర్మాణ కార్మికుడి మృతి



కుమార్తె వర్షిణితో వాసంశెట్టి మునీంద్ర (ఫైల్)

రామచంద్రపురం రూరల్: కరెంట్ షాక్‌తో భవన నిర్మాణ కార్మికుడి మృతి చెందడంతో వెల్ల గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. స్థానికులు, ద్రాక్షారామ ఎస్సై జి.సురేంద్ర తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వెల్ల గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు వాసంశెట్టి మునీంద్ర(29) మంగళవారం అన్నాయిపేటలో అల్లం రామకృష్ణ ఇంటి వద్ద రాడ్ బెండింగ్ పనికి వెళ్లాడు. చేతిలో ఊచని సరిచేసి పైకి తరలిస్తుండగా ఎదురుగా ఉన్న విద్యుత్ తీగలకు తగిలి కరెంట్ షాక్‌కు గురయ్యాడు. స్థానికులు రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మునీంద్రకు భార్య మౌనిక, కుమారుడు సత్య విరాజ్(3), ఏడాదిన్నర కుమార్తె వర్షిణీదుర్గ ఉన్నారు. చిన్నపిల్లలతో తన జీవితం ఎలా అంటూ మౌనిక రోదిస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టించింది.

బైబిల్ బోధనలు అనుసరణీయం

కపిలేశ్వరపురం (మండపేట): బైబిల్ బోధనలు అనుసరణీయమని ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. మండపేట పట్టణంలో ఐదు రోజులుగా డానియేల్ పాల్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పెంతె కోస్తు క్రైస్తవ మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే వేగుళ్ళను క్రైస్తవ సభల నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

గురుకుల పాఠశాల సూపరింటెండెంట్‌కు సత్కారం



రాజశేఖర్‌ను సత్కరిస్తున్న అధ్యాపకులు, సిబ్బంది

రామచంద్రపురం రూరల్: రిపబ్లిక్ డే వేడుకల్లో ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న ద్రాక్షారామ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలుర పాఠశాల సూపరింటెండెంట్ బి.రాజశేఖర్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్‌వీ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.